సాక్షి
మంచిర్యాల
మంగళవారం । 10 । అక్టోబర్ । 2023



పట్టభద్రుడు..డ్రాగన్ ధీరుడు
దండేపల్లి మండలం కొండాపూర్‌కు చెందిన ఇప్ప సత్యనారాయణ డిగ్రీ వరకు చదివాడు. కొత్తరకం పంటలు వేయాలనుకుని ఉద్యానవన పంటలపై దృష్టి సారించాడు. 8లో ▸



ఆధారాలు లేకుంటే జప్తే..!
పెద్ద మొత్తంలో నగదుతో బయటకు వెళ్లినా ప్రయాణాలు చేసినా తస్మాత్ జాగ్రత్త. నేటి నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. డబ్బులతో పోలీసులకు దొరికితే జప్తు చేస్తారు. 8లో ▸

గరిష్టం/కనిష్టం
34.0 /23.0

వాతావరణం
ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. ఉత్తరం దిశగా గాలులు వీస్తాయి. గరిష్ట ఉష్ణోగ్రత స్వల్పంగా పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రోడ్డెక్కిన ఆఫర్లు..
- జిల్లా కేంద్రంలోని మార్కెట్‌లో అదుపు తప్పిన ట్రాఫిక్



మంచిర్యాలలోని ప్రధాన మార్కెట్ ఏరియాలో రోడ్డుపైనే భారీ లైటింగ్ ఏర్పాటు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జిల్లా కేంద్రంలోని ప్రధాన మార్కెట్ ఏరియాలో కొందరు వ్యాపారులు తమ వ్యాపారమే లక్ష్యంగా ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారు. అయినా పట్టించుకునే అధికారులే కరువయ్యారు. రోజుకో ఆఫర్ల పేరుతో వస్త్ర దుకాణాలు, ఇతర షాపింగ్ మాల్ యజమానులు రోడ్లను ఆక్రమిస్తూ డీజే సౌండ్స్, లైటింగ్ సిస్టమ్స్, భారీగా అలంకరణలు చేస్తున్నారు. కొనుగోలుదారులను ఆకర్షించేందుకు పూర్తిగా దారి తప్పిపోతున్నారు. ఒకరిని మించి మరొకరు తమ దుకాణాలకు రప్పించుకునేందుకు ప్రత్యేక ఆఫర్ల పేరుతో నడి రోడ్డునే ఆక్రమణలు గురి చేస్తూ ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నారు. ప్రతీ రోజు సాయంత్రం ఏడు గంటల నుంచి రాత్రి తొమ్మిది దాటే వరకు రోడ్లన్నీ కిక్కిరిసిపోయి ఉంటున్నాయి. ఓ వైపు రోడ్లపైనే బైక్ పార్కింగ్, మరోవైపు ఆటోలు, బైక్‌లు, ఫోర్ వీలర్స్ రాకపోకలతో మార్కెట్ ఏరియాలో ట్రాఫిక్ నియంత్రణ గతి తప్పిపోయింది. వాహనాలు అటు, ఇటు వెళ్లేందుకు విపరీతమైన హారన్ల మోతతో చెవులు గిల్లుమన్నేలా శబ్ద కాలుష్యం ఏర్పడుతోంది. ఇదంతా చూస్తున్న మున్సిపాలిటీ అధికార యంత్రాంగం, ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి సారించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం ఈ పండుగ రద్దీ వేళలో అయినా అధికారులు ట్రాఫిక్ బాధ తీర్చాలని కోరుతున్నారు.

తహసీల్దార్ల బదిలీ

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో ఐదుగురు తహసీల్దార్లను బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ బి.సంతోష్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కే.వనజారెడ్డి జన్నారం నుంచి నస్పూర్ మండలానికి, ఇమ్రాన్‌ఖాన్‌ను నస్పూర్ నుంచి నెన్నెలకు, ఎం.భోజన్నను మంచిర్యాల నుంచి కాసిపేటకు, కేవై.ప్రసాద్‌ను నెన్నెల నుంచి మంచిర్యాలకు, వేణుగోపాల్‌ను కాసిపేట నుంచి జన్నారానికి బదిలీ చేశారు.

కాంట్రాక్టు కార్మికుల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టిన ఐఎఫ్‌టీయూ నాయకులు

మంచిర్యాలఅగ్రికల్చర్: సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఎస్‌సీసీడబ్ల్యూయూ–ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మానందం మాట్లాడుతూ సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం చెల్లించాలని, హక్కులు, సౌకర్యాలు కల్పించాలని అన్నారు. ప్రభుత్వం కాంట్రాక్ట్ కార్మికలకు లాభాల వాటా కేటాయించడం లేదని, జాతీయ పండుగ సెలవులు ఇవ్వడం లేదని తెలిపారు. ఇప్పటికైనా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్ ఏవో రాజేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శంకర్, బక్కయ్య, అప్పారావు, శేఖర్, గురువులు, లంక శ్యామ్, అరుణ, శోభ, పద్మ, సరోజన, భాగ్య, రజిత, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట నిరసన




నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ బాధ్యులు

మంచిర్యాలఅర్బన్: పెండింగ్‌లో ఉన్న విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంటు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పాత కలెక్టరేట్ భవనాన్ని ఎస్సీ బాలికల వసతిగృహానికి ఇవ్వాలని అన్నారు. శిథిలావస్థలో ఉన్న కళాశాల భవనాలు తొలగించి నూతనంగా నిర్మాణాలు చేపట్టాలని పేర్కొన్నారు. వసతిగృహాల్లో మెస్, కాస్మొటిక్ చార్జీలు తక్షణమే విడుదల చేయాలన్నారు. అక్రమంగా అరెస్ట్ చేసిన జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ బాధ్యుడు అభినవ్ పాల్గొన్నారు.

సమరం ఆరంభం !

- అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు ఇక 51రోజులే..
- షెడ్యూల్ రాకతో కోడ్ అమలు
- దూకుడు పెంచిన రాజకీయ నాయకులు
- ఉమ్మడి జిల్లాలో మొదలైన ఎన్నికల సందడి



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అసెంబ్లీ ఎన్నికల సమరం మొదలైంది. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు షెడ్యూల్ వెలువడడంతో అటు అధికార యంత్రాంగం, ఇటు రాజకీయ నాయకులకు వచ్చే 51రోజుల కాలం కీలకంగా మారనుంది. వచ్చే నెల 3న ఎన్నికల నోటిఫికేషన్, 30న పోలింగ్, డిసెంబర్ 3న ఫలితాల వెల్లడి వరకు ఉమ్మడి జిల్లాలోని పది నియోజకవర్గాల్లో రాజకీయ హడావుడి కొనసాగనుంది. ప్రతీ ఐదేళ్లకోసారి జరిగే ఎన్నికలు ప్రజాస్వామ్యంలో ఓట్ల పండుగగా అభివర్ణిస్తారు. ఈ క్రమంలో ఈసారి దసరా పండుగకు ముందే ఎన్నికల పండుగ వాతావరణం వచ్చేసింది.

కోడ్ అమలుతో జాగ్రత్త

ఎన్నికల నిబంధనల ప్రకారం ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఉమ్మడి జిల్లాలో ఇక నుంచి ప్రభుత్వ, అధికారికంగా కొత్త కార్యక్రమాలు జరగవు. అంటే రాజకీయ నాయకులచే శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు ఉండవు. అలాగే ప్రతి ఒక్కరూ ఎన్నికల కోడ్‌ను పాటించాల్సి ఉంటుంది. రూ.50వేల కన్నా అధిక నగదు, పెద్ద మొత్తంలో మద్యం, ఎక్కువ సంఖ్యలో వస్తువుల రవాణాపై నిఘా ఉంటుంది. తరలించే వాటికి సరైన ధ్రువపత్రాలు లేకపోతే సీజ్ చేస్తారు. ఇప్పటికే జిల్లాలో అంతర్రాష్ట్ర, జిల్లాల సరిహద్దులు, మండల, జిల్లా కేంద్రాల్లోని ప్రధాన రహదారులపై చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు.

అధికారులు సిద్ధం

ఎన్నికల కోడ్ అమలుతో అధికార యంత్రాంగం మరింత పకడ్బందీగా వ్యవహరించాల్సి ఉంటుంది. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో ఎన్నికల నిబంధనల ప్రకారం బదిలీలు, తుది ఓటరు జాబితా పూర్తయ్యాయి. అలాగే పది శాసనసభ స్థానాలకు ఆర్వో (రిటర్నింగ్ ఆఫీసర్లు), మండలాల్లో ఏఆర్వో(అసిస్టెంట్ రిట ర్నింగ్) అధికారులు నియమితులయ్యారు. ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ప్రత్యేకంగా ఎన్నిక ల నిర్వహణపై ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశా రు. పోలింగ్ కేంద్రాలు, సమస్యాత్మక ప్రాంతాల గుర్తింపు, ఈవీఎంల పరిశీలన, తదితరవన్నీ సిద్ధంగా ఉన్నాయి. ఈ క్రమంలో ఫలితాలు వెల్లడయ్యే వరకు అధికారులు సాధారణ పరిపాలనతోపాటు ఎన్నికల విధులతో బిజీ బిజీగా గడపనున్నారు.

సమయం లేదు నాయకా!

ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే ఓట్ల కోసం రాజకీయ నాయకుల ఎన్నికల ప్రచారం మొదలైంది. షెడ్యూల్ రాకతో నాయకులు మరింత దూకుడు పెంచారు. అధికార బీఆర్‌ఎస్ పార్టీలో మాత్రమే పది అసెంబ్లీ స్థానాల్లో పోటీలో ఉండే అభ్యర్థులు ఖరారయ్యారు. బీఎస్పీ నుంచి సిర్పూర్, ఖానాపూర్ నియోజకవర్గాల్లో పోటీలో ఉన్నవారి పేర్లు వెల్ల డయ్యాయి. మిగతా కాంగ్రెస్, బీజేపీ, వామపక్షాలు, ఇతర పార్టీల్లో ఇప్పటికీ అభ్యర్థుల ప్రకటన రాలేదు. అభ్యర్థుల ఎంపిక కోసం కసరత్తు జరుగుతోంది. దీంతో నాయకుల్లో ఉత్కంఠ కొనసాగుతోంది. ఓ వైపు షెడ్యూల్ వెలువడి బీఆర్‌ఎస్ అభ్యర్థులు ప్రచారం సాగిస్తుంటే ఇంకా తమ పోటీపై సందిగ్ధం కొనసాగుతుండడంతో పోటీకి దిగాలనుకునే నాయకులు పూర్తి స్థాయిలో ఓట్ల ప్రచారం మొదలు పెట్టడం లేదు. కొంద రైతే తమకే టికెట్ గ్యారెంటీ అనే నమ్మకంతోనూ నియోజకవర్గాల్లో పని చేస్తున్నారు. ఈ క్రమంలో విపక్ష పార్టీ నాయకులు ప్రస్తుత కాలాన్ని పూర్తి స్థాయిలో వినియోగించుకోవాల్సి ఉంది.

ఎన్నికల కోడ్ అమలు చేయాలి



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సంతోష్, పాల్గొన్న అదనపు కలెక్టర్లు

- ప్రత్యేక కంట్రోల్ రూమ్ నంబరు 1950
- సరైన ఆధారాలు లేకుండా రూ.50 వేల పైగా తరలిస్తే సీజ్
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: ఎన్నికల ప్రవర్తన నియమావళి జిల్లాలో కచ్చితంగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. సోమవారం నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు బి.రాహుల్, మోతీలాల్‌తో కలిసి ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల విభాగం అధికారులు, పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా ఎన్నికల అధికారి సంతోష్ మాట్లాడుతూ ఎన్నికల ఖర్చుల పర్యవేక్షణ పరిశీలకులు, సహాయ పరిశీలకులు, ఫ్లయింగ్ స్క్వాడ్–స్టాటిక్ సర్వేలైన్స్ బృందాలు, వీడియో సర్వేలైన్స్, అకౌంటింగ్, ఎక్సైజ్, మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నియోజకవర్గాల వారీగా విభజించి విధులు కేటాయించామని, అధికారులు అలసత్వం, నిర్లక్ష్యం వహించకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయా బృందాలకు కేటాయించిన ఫారాలను పూర్తి వివరాలతో అందించాలని పేర్కొన్నారు. ప్రతీ నియోజకవర్గంలో మూడు కంటే ఎక్కువగా ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు విధులు నిర్వర్తిస్తాయని, నియోజకవర్గంలో జరిగే అంశాలను తప్పనిసరిగా వీడియో రికార్డింగ్ చేయాలని అన్నారు.

ప్రత్యేక కంట్రోల్ రూమ్

ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు ఎన్నికల సంబంధిత ఫిర్యాదులపై స్పందించాలని, మద్యం, నగదు, కానుకల పంపిణీపై ప్రత్యేక నిఘా ఉంచాలని, రాజకీయ పార్టీలకు సంబంధించి ఖర్చులపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎన్నికల అధికారి సంతోష్ తెలిపారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం నంబరు 1950 ఏర్పాటు చేశామని, సీ విజిల్ యాప్ ద్వారా అందిన ఫిర్యాదులపై స్పందించాలని అన్నారు. రూ.50వేల కంటే అధికంగా నగదు తరలింపుపై ఆధారాలు లేకుంటే సీజ్ చేస్తామని, రూ.10వేల కంటే విలువైన మద్యం తరలించినా సీజ్ చేస్తామని తెలిపారు. వీడియో సర్వేలైన్ బృందాలు రాజకీయ పార్టీల సమావేశాలు రికార్డు చేయాలని, ఖర్చులపై ప్రత్యేక బృందాలు నిఘా ఉంచాలని అన్నారు. దినపత్రికలు, టీవీ చానళ్లు, మొబైల్ సందేశాలు, సామాజిక మాధ్యమాలపై దృష్టి సారించాలని, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ప్రచార సమయంలో అనుమతి పొందాలని సూచించారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులకు వివరించారు.

ఫొటోలు, హోర్డింగ్‌లు తొలగించాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్

మంచిర్యాలఅగ్రికల్చర్: ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చినందున 24గంటల వ్యవధిలో ప్రతీ ప్రభుత్వ భవనాల్లో రాజకీయ పార్టీలు, నాయకుల హోర్డింగ్‌లు, ఫొటోలు, వాల్‌రైటింగ్స్ తొలగించాలని, 48 గంటల వ్యవధిలో ప్రభుత్వ ఆస్తులపై హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు, ఫొటోలు తొలగించాలని, ప్రైవేటు స్థలాల్లోని హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు, ఫొటోలు 72గంటల్లో తొలగించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పోలీసు శాఖ అధికారులు, శాసనసభ రిటర్నింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నియమావళి కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. వివిధ ప్రభుత్వ శాఖల వెబ్‌సైట్లలో ముఖ్యమంత్రి, మంత్రుల ఫొటోలు తొలగించాలని, రాజకీయ పార్టీలు, వివిధ వర్గాల ప్రజల ర్యాలీలు, సభల నిర్వహణకు అనుమతులు నిబంధనల ప్రకారం జారీ చేయాలని అన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వివరాలు సమర్పించాలన్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సంతోష్ మాట్లాడుతూ ఎన్నికల నియమావళి అమలుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారులను నియమించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు రాహుల్, మోతీలాల్, డీసీపీ సుధీర్‌రాంనాథ్ కేకన్, ఎన్నికల విభాగం, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



పాల్గొన్న ఎన్నికల అధికారి సంతోష్, డీసీపీ సుధీర్‌రాంనాథ్, అదనపు కలెక్టర్ రాహుల్

సత్వరమే సమస్యలు పరిష్కరించాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రజా ఫిర్యాదుల విభాగంలో వచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్ అన్నారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. భూ సమస్యలు, పింఛన్ తదితర సమస్యలపై వచ్చిన అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఆర్డీవో సురేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ మోతీలాల్

మద్యం దుకాణం తరలించాలి



క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో గద్దరేగడి వార్డు నంబరు 8లో ఏర్పాటు చేసి న మద్యం దుకాణం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మందుబాబుల కొట్లాటలు, రోడ్లపైనే మూత్రవిసర్జనతో వి ద్యార్థులు, మహిళలు రోడ్డుగుండా నడవలేకపోతున్నారు. మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారు. అక్కడి నుంచి మద్యం దుకాణం తొలగించాలి.

– కుందారపు దత్తు, క్యాతన్‌పల్లి, గద్దరేగడి

బియ్యం పోయడం లేదు



మంచిర్యాలలోని ఇస్లాంపూర వార్డు నంబరు 25లో నివాసం ఉంటున్నాం. తెల్ల రేషన్ కార్డు కలిగి ఉన్నాను. గత కొన్ని నెలలుగా వేలిముద్రలు, ఐరిష్ పనిచేయకపోవడం వల్ల బియ్యం పోయడం లేదు. బియ్యం, పింఛన్ వచ్చేలా చూడాలి.

– బండి కనయ్య, మంచిర్యాల

గ్రంథాలయం ఏర్పాటు చేయాలి



నస్పూర్ మున్సిపాలిటీ పరిధి శ్రీరాంపూర్‌లో గ్రంథాలయం ఏర్పాటు చేయాలి. ఎంతోమంది ఉద్యోగ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. తాత్కాలికంగా సింగరేణి క్వార్టర్స్‌లో గ్రంథాలయం ఏర్పాటు చేయాలి. ఎందరో నిరుద్యోగులకు ఉపయోగకరంగా ఉంటుంది.

– శ్రీరాంపూర్ కాలనీ వాసులు,

మోటార్‌సైకిళ్లు ఇవ్వాలి



జిల్లాలోని దివ్యాంగులందరికీ వీల్ మోటార్ సైకిళ్లు ఇవ్వాలి. త్రీవీల్లర్ మోటార్ సైకిళ్ల కోసం దరఖాస్తు చేసుకోగా పది వాహనాలకు గత ఆగస్టు 22న ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంతవరకు లబ్ధిదారుల జాబితా ఇవ్వలేదు. వాహనాలతోపాటు డబుల్ బెడ్‌రూం ఇళ్లు, రూ.6వేల పింఛన్ చెల్లించాలి.

– దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షురాలు రజిత, పట్టణ అధ్యక్షురాలు రమణి, మారపల్లి నరేష్

ఆర్టీఏ కార్యాలయం ఏర్పాటు చేయాలి



బెల్లంపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలో ఏడు మండలాలలు ఉన్నాయి. డివిజన్ ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా ఇంతవరకు డ్రైవింగ్ స్కూల్, ఆర్టీఏ కార్యాలయం లేదు. దూరప్రాంతాల నుంచి మంచిర్యాల జిల్లా కేంద్రం వెళ్లేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఆర్టీఏ కార్యాలయం ఏర్పాటు చేయాలి.

– కొలిపాక శ్రీనివాస్, బెల్లంపల్లి

కేజీబీవీలో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యుడు కృష్ణ

భీమిని: కన్నెపల్లి మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఆదివారం విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురికాగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శిబిరం ఏర్పాటు చేవారు. బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. జెడ్పీటీసీ కొటారపు సత్యనారాయణ వైద్యశిబిరాన్ని సందర్శించారు. అనంతరం విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని ప్రత్యేక అధికారి వినితకు సూచించారు.

'డీఈవో, ఎంఈవోలను సస్పెండ్ చేయాలి'



ఆందోళనలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

మంచిర్యాలఅగ్రికల్చర్: కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవడంలో విఫలమైన డీఈవో, ఎంఈవోలను సస్పెండ్ చేయాలని ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం పట్టణ కార్యదర్శి రేగుల సిద్దార్థ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీపై విద్యార్థి సంఘాలు పలుమార్లు జిల్లా విద్యాశాఖ అధికారికి ఫిర్యాదు చేసినా విచారణ పేరిట కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. సీబీఎస్‌ఈ అనుమతులు లేకున్నా ఉన్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులకు చెబుతూ అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. వెంటనే విద్యాశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని అన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు.

డీపీఎం, ఆపరేటర్ల సమ్మె విరమణ



విధుల్లో చేరుతున్నట్లు డీపీఓకు వినతి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): పంచాయతీరాజ్ శాఖ ఈ–పంచాయతీ విభాగంలోని జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్(డీపీఎం), ఈ–పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు సమ్మె విరమించి విధుల్లో చేరారు. ఈ మేరకు సోమవారం జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ) వెంకటేశ్వర్‌రావుకు విన్నవించారు. ఈ సందర్భంగా డీపీఎం దాసరి నరేందర్ మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు గత నెల 29 నుంచి నేటి వరకు 11 రోజులపాటు శాంతియుతంగా సమ్మె నిర్వహించామని తెలిపారు. ప్రతీ ప్రజాప్రతినిధి తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూస్తామని హామీనిచ్చారని పేర్కొన్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించందని, రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు సమ్మె విరమిస్తూ విధుల్లో చేరుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ–పంచాయతీ ఆపరేటర్ల సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి అక్కెపల్లి కుమారస్వామి, జిల్లా అధ్యక్షుడు సోడాయి రాకేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు పవన్, ఈ–పంచాయతీ ఆపరేటర్లు పాల్గొన్నారు.

విద్యాశాఖ కార్యాలయ సామగ్రి తరలింపు



కార్యాలయంలో మూటగడుతున్న ఫైళ్లు

మంచిర్యాలఅర్బన్: జిల్లా విద్యాశాఖ కార్యాలయ సామగ్రిని సోమవారం తరలించారు. ఇదివరకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డీఈవో కార్యాలయానికి ఎస్–17 గదిని కేటాయించారు. ఇందులో భాగంగా డీఈవో కార్యాలయంలో రికార్డులు, సామగ్రిని తరలించారు. ఒకటి రెండు రోజుల్లో కార్యాలయం పూర్తిగా తరలించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

కోడ్ కూసింది.. ఫ్లెక్సీ తొలగింది



లక్సెట్టిపేట: అంబేద్కర్ చౌరస్తా వద్ద తొలగించని పలు పార్టీల ఫ్లెక్సీలు



కలెక్టరేట్‌లో ఫ్లెక్సీలు తొలగిస్తున్న సిబ్బంది



దండేపల్లి: పార్టీ జెండాలు తొలగింపు

మంచిర్యాలఅగ్రికల్చర్/దండేపల్లి/లక్సెట్టిపేట: అసెంబ్లీ ఎన్నికల కోడ్ సోమవారం నుంచి అమల్లోకి రావడంతో కలెక్టరేట్‌లోని వివిధ ప్రభుత్వ పథకాల ఫ్లెక్సీలు కలెక్టర్ సంతోష్ ఆదేశాల మేరకు తొలగించారు. ఫ్లెక్సీలు, గోడలపై ఉన్న వాల్ రైటింగ్‌లు తొలగించే పనిలో సిబ్బంది నిమగ్నమయ్యారు. దండేపల్లి మండల కేంద్రంలో ప్రధాన కూడళ్లలోని వివిధ రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, పార్టీ కార్యాలయాల ఎదుట జెండాలు, ప్రచార పోస్టర్లను పంచాయతీ సిబ్బంది తొలగించారు. లక్సెట్టిపేట మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో, ఎంపీడీవో కార్యాలయం ఎదుట బోర్డుపై ఏర్పాటు చేసిన ప్రభుత్వ సంక్షేమ పథకాల పోస్టర్లను సిబ్బంది తొలగించారు. అంబేద్కర్ చౌక్‌లో ప్రజాప్రతినిధుల ఫ్లెక్సీలు తొలగించాల్సి ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడంతో అలాగే దర్శనమిస్తున్నాయి.

క్లుప్తంగా

గొర్రెల పంపిణీ వేగవంతం చేయాలి



వినతిపత్రం ఇస్తున్న అశోక్‌యాదవ్

భీమారం: రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని కోరుతూ గొర్రెలు, మేకల పెంపకం దారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము అశోక్‌యాదవ్ సోమవారం హైదరాబాద్‌లో తెలంగాణా షీప్ అండ్ గోట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దూదిమెట్ల బాలరాజుకు వినతిపత్రం అందజేశారు. మంచిర్యాల జిల్లాలో 2,300 గొర్రెల యూనిట్ల కోసం డీడీలు చెల్లిస్తే ఇప్పటి వరకు కేవలం 480 యూనిట్లు మాత్రమే పంపిణీ అయ్యాయన్నారు. దీంతో డీడీలు చెల్లించిన వారు నానాఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా చర్యలు తీసుకొని గొర్రెలను పంపిణీ చేయాలని కోరినట్లు ఆయన పేర్కొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు



ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్న వ్యక్తులు

మంచిర్యాలక్రైం: శాంతి భద్రతల దృష్ట్యా సోమవారం ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ రాజు తెలిపారు. స్థానిక హమాలివాడకు చెందిన దుష్త సురేష్, కొటాల మండలానికి చెందిన గొర్లపెల్లి సురేష్ మంచిర్యాల పట్టణంలోని రహదారులపై స్థానిక ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, అతని కుమారుడి ఫొటోలు ఉన్న ఫ్లెక్సీతో వారికి వ్యతిరేకంగా ప్రచారం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ముందస్తుగా వారిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

హాజరుపై జీఎం సమీక్ష



మాట్లాడుతున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: ఉద్యోగుల రోజువారి హాజరుపై శ్రీరాంపూర్ జీఎం బీ.సంజీవరెడ్డి సోమవారం ఏరియా పర్సనల్ డిపార్టుమెంట్, గనుల అధికారులతో ఇన్‌మస్టర్, అవుట్ మస్టర్, ఓటీలపై సమీక్ష నిర్వహించారు. ప్రతీనెల వివిధ గనులు, విభాగాలలో నమోదవుతున్న మస్టర్లపై అధికారులు దృష్టి సారించాలన్నారు. సమావేశంలో ఎస్‌వోటూ జీఎం రఘు కుమార్, ఏరియా ఇంజినీర్ చంద్రశేఖర్ రెడ్డి, ఓసీపీ అధికారులు ఎం.శ్రీనివాస్, పురుషోత్తంరెడ్డి, ఏజెంట్లు ఏవీరెడ్డి, శ్రీగోపాల్‌సింగ్, శ్రీరాముడు, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, డీజీఎం(ఐఈడీ) చిరంజీవు, ఏరియా స్టోర్స్ యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం



డబ్బులు చెల్లించాలని కోరుతున్న బాధితులు

బెల్లంపల్లి: స్వయం ఉపాధి కోసం బ్యాంకు నుంచి మంజూరైన డబ్బులు ఇవ్వకుండా మధ్యవర్తులు సతాయిస్తుండటంతో ఓ వ్యక్తి ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన సోమవారం బెల్లంపల్లిలో చోటు చేసుకుంది. బాధితుడి భార్య ఎండి.సల్మాబేగం తెలిపిన వివరాల ప్రకారం బెల్లంపల్లి మున్సిపాలిటీ షంషీర్‌నగర్ బస్తీకి చెందిన ఎండి సాజిద్ టెంట్ హౌజ్ ఏర్పాటు చేసుకోవడానికి బ్యాంకులోను కోసం దరఖాస్తు చేసుకున్నాడు. రూ.8.50 లక్షలు మంజూరు కావడంతో ఓ టెంట్‌హౌజ్ నిర్వాహకుడి నుంచి కొటేషన్ తీసుకోగా బ్యాంకు అధికారులు ఆ వ్యక్తి పేరు మీద చెక్ ఇచ్చారు. ఆ డబ్బులు డ్రా చేసిన సదరు టెంట్ హౌజ్ నిర్వాహకుడు సాజిద్‌కు కాకుండా మధ్యవర్తిత్వం వహించిన వ్యక్తికి ఇచ్చాడు. డబ్బులు ఇవ్వాలని సాజిద్ కోరగా మధ్యవర్తి దబాయించడంతో దిక్కుతోచని స్థితిలో అందరూ చూస్తుండగానే ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించడంతో స్థానికులు అడ్డుకున్నారు. బాధితుడికి నచ్చజెప్పి పంపించారు. పోలీసులు న్యాయం చేయాలని బాధిత కుటుంబం కోరుతోంది.

ఆధారాలు లేకుంటే జప్తే..!

- అమలులోకి వచ్చిన ఎన్నికల కోడ్
- నగదుకు ఆధారాలు తప్పనిసరి ..
- మనీ, మద్యం, ఆయుధాల రవాణాపై డేగ కన్ను
- ఖాకీల ముందస్తు ప్రణాళిక
- ఇప్పటికే ఎస్పీలతో సీపీ సమావేశం



గూడెం చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేస్తున్న పోలీసులు (ఫైల్)

మంచిర్యాలక్రైం: రానున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఎవరైనా పెద్ద మొత్తంలో నగదుతో బయటకు వెళ్లినా ప్రయాణాలు చేసినా తస్మాత్ జాగ్రత్త.. నేటి నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. అధిక మొత్తంలో డబ్బులతో పోలీసులకు దొరికితే జప్తు.. లేదా పేకాట పేరుతో కేసులు నమోదు చేయనున్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్ యంత్రాంగం ఇప్పటికే ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసింది. ప్రధానంగా ఎన్నికల నేపథ్యంలో పెద్దమొత్తంలో డబ్బు, మద్యం, ఆయుధాలు అక్రమ రవాణా జరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోలీస్‌శాఖ పకడ్బందీ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి అంతర్‌జిల్లా ఎస్పీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, నిరంతరం వాహనాలు తనిఖీ చేయాలని సూచించారు.

ఆధారాలు లేకుంటే...

ఎన్నికల సమయంలో నగదు, బంగారం, మద్యం పెద్ద మొత్తంలో తీసుకెళ్లకూడదు. సొంతడబ్బు అయినా లెక్క చూపాల్సిందే. రూ.50 వేలకు పైగా డబ్బులు తీసుకెళ్లాల్సి వస్తే వాటికి తగిన ఆధారాలు చూపించాలి. లేదంటే జప్తు చేయక తప్పదు. ఎక్కువ మాట్లాడితే పేకాట పేరుతో కేసులు నమోదు చేయడం ఖాయం.

రికవరీ ఏజెంట్లు...

ఏదైనా సంస్థలో రికవరీ ఏజెంట్లుగా పనిచేసేవారైతే పనిచేస్తున్న కంపనీ గుర్తింపుకార్డు, కలెక్షన్ చేయాల్సిన బాధితుడి పేరు, సెల్‌నంబర్‌తో కూడిన లిస్టు, ఆరోజు ఎవరెవరు ఎంత కలెక్షన్ ఇచ్చారో వారి సంతకంతో కూడిన వివరాలు అధికారులకు చూపించాలి.

అప్పుగా తీసుకుంటే ...

అవసరం నిమిత్తం ఎవరి వద్దనైనా అప్పుగా తీసుకుని వెళ్తుండగా పోలీసులకు పట్టుబడితే ఎవరివద్ద తీసుకున్నారు? ఎప్పుడు తీసుకున్నారు? ఎంత తీసుకున్నారు? తదితర వివరాలతో పాటు ప్రామిసరీ నోటు వెంట ఉంచుకోవాలి. ఒకవేళ ఆస్పత్రి బిల్లులు కట్టాల్సివస్తే పేషెంట్ పేరు, ఆస్పత్రికి సంబంధించిన బిల్లులు వెంట ఉంచుకోవాలి.

నిబంధనలు తప్పనిసరి

ఆదాయ పన్ను చట్టం 1961 సెక్షన్ 69–ఏ ప్రకారం ఎవరైనా తమవద్ద ఉన్న డబ్బు, బంగారం, ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులను ఒకచోట నుంచి మరోచోటుకు తరలించే ముందు ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించడం తప్పనిసరి.

బ్యాంకు నుంచి విత్‌డ్రా చేస్తే ...

బ్యాంకు నుంచి రూ.50 వేలకంటే ఎక్కువగా విత్‌డ్రా చేస్తే ఆధారాలు అవసరం. బ్యాంకు అధికారి ఇచ్చిన ఓచర్ స్లిప్ విధిగా వెంట ఉంచుకోవాలి. సెల్ఫ్ చెక్ ద్వారా అయితే సంబంధిత చెక్ జిరాక్స్ కాపీ, ఏటీఎం ద్వారా డ్రా చేస్తే మిషన్ ద్వారా వచ్చిన స్లిప్ వెంట ఉంచుకోవాలి. ఒకవేళ బ్యాంకులో డిపాజిట్ చేయాలనుకుంటే వ్యక్తిగత డిక్లరేషన్, బ్యాంకు పాస్‌బుక్ వెంట ఉంచుకోవాలి.

ఆధారాలు లేకుంటే అంతే..

రానున్న సాధారణ ఎన్నికల దృష్ట్యా సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయనున్నారు. ఇలాంటి సమయంలో పెద్ద మొత్తంలో నగదు పట్టుబడితే తగిన ఆధారాలు చూపించని పక్షంలో డబ్బు జప్తు చేయబడుతుంది. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం రూ.50 వేలకు మించి డబ్బు తీసుకెళ్తే స్వాధీనం చేసుకుంటారు. ఆధారాలు చూపించకుంటే వాటిని ఆదాయపుపన్ను శాఖ ఖాతాలో వేస్తారు. అక్కడి నుంచి డబ్బు పొందాలంటే చుక్కలు లెక్క పెట్టాల్సిందే. లేదంటే ఎన్నికలు పూర్తయిన తర్వాత ఆధారాలు సరిగా లేకపోతే 30 శాతం పన్నుకింద తీసుకుని మిగతా డబ్బులు ఇస్తారు. ఈ నిబంధనలు తెలియక చాలామంది పెద్ద మొత్తంలో నగదు తీసుకెళ్తూ చెక్‌పోస్టుల వద్ద పట్టుబడుతుంటారు.

నేటినుంచి లోకల్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు పునఃప్రారంభం

కాగజ్‌నగర్‌టౌన్/సిర్పూర్(టి): నేటి నుంచి అన్ని లోకల్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను పునః ప్రారంభిస్తున్నట్లు కాగజ్‌నగర్ రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ కై లాస్ తెలిపారు. కాజీపేట–బల్లార్ష మధ్య మూడో రైల్వే పనుల నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే అధికారులు మూడునెలల క్రితం పలు ప్యాసింజర్ రైళ్లను రద్దు చేసిన విషయం తెలిసిందే. ప్రయాణికుల తీవ్ర ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని మంగళవారం నుంచి కాజీపేట–సిర్పూర్ కాగజ్‌నగర్ (17003), కరీంనగర్–సిర్పూర్ కాగజ్‌నగర్ (17765), సిర్పూర్ కాగజ్‌నగర్–కరీంనగర్(17766), బోధన్–కరీంనగర్(17893), కరీంనగర్–బోధన్ (17894), సిర్పూర్ కాగజ్‌నగర్–భద్రాచలం రోడ్డు(17034), బుధవారం నుంచి బల్లార్ష–కాజీపేట (17004), భద్రాచలంరోడ్డు–కులార (170 3 3) ప్యాసింజర్ రైళ్లు పునఃప్రారంభించనున్న ట్లు రైల్వే ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. కాజీపేట–బల్లార్ష (17035 369 ఎక్స్‌ప్రెస్ రైలు పునరుద్ధరణపై అధికారులు ప్రకటన జారీ చేయలేదన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

ఎదులాపురం: ఆటో డ్రైవర్‌పై దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్సై ప్రదీప్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం... తాటిగూడ కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ ఎస్‌కే అయాన్ శనివారం రాత్రి తాటిగూడకు వెళ్తుండగా బబ్లూ అనే వ్యక్తి బైక్ రహదారిపై అడ్డంగా ఉంచాడు. ఆ వాహనాన్ని పక్కకు తీయమనడంతో బబ్లూ, అతడి కుమారుడు అఫ్తాబ్, సోదరుడు అయాన్ కర్రలతో ఆటో డ్రైవర్‌పై దాడికి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

‘ట్రేడ్స్‌మెన్‌లకు సూటబుల్ జాబ్ ఇవ్వాలి’



నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు

మందమర్రిరూరల్: సింగరేణిలో విధులు నిర్వహిస్తూ అనారోగ్య కారణాలతో అండర్ గ్రౌండ్ విధులకు మెడికల్ అన్‌ఫిట్ అయిన ఎలక్ట్రీషియన్, ఫిట్టర్(ట్రేడ్స్‌మెన్)లకు సూటబుల్ జాబ్ కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం ఏరియా వర్క్‌షాపులోని డీవైజీఎం కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ గతంలో మైనింగ్ స్టాఫ్ మెడికల్ అన్‌ఫిట్ అయితే డీప్రమోట్ చేస్తూ జనరల్ మజ్దూర్‌గా జాబ్ కేటాయించడంతో ఏఐటీయూసీ ఆందోళనలతో వారికి సూటబుల్ జాబ్ ఇస్తున్నారన్నారు. అలాగే ట్రేడ్స్‌మెన్‌లకు కూడా ఇవ్వాలని లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శర్మ, రాజేశం, సర్జన్, భూమయ్య, తిరుపతి, రాజమౌళి, తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన

కాసిపేట: ట్రేడ్స్‌మెన్లకు సూటబుల్ జాబ్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మందమర్రి ఏరియా కాసిపేట గనిపై సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో టెక్నీషియన్లు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో గని పిట్ కార్యదర్శి మినుగు లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ పిట్ కార్యదర్శి రాజేందర్, నాయకులు ఇరుగురాల సంపత్, ఆడెపు రవీందర్, పార్వతి సురేష్, కొక్కెర సంతోష్, కొలకాని శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఓబీ లక్ష్యాన్ని సాధించాలి



ఓబీ పనులు పరిశీలిస్తున్న డైరెక్టర్

శ్రీరాంపూర్: ఓపెన్‌కాస్టు నిర్దేశించిన ఓవర్ బర్డెన్ మట్టి ఓబీ వెలికితీత లక్ష్యాన్ని సాధించాలని సింగరేణి డైరెక్టర్ (ప్లానింగ్, ప్రాజెక్ట్) జీ.వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్టు గనిని జీఎం సంజీవరెడ్డితో కలిసి సందర్శించారు. వ్యూపాయింట్ నుంచి పరిశీలించిన అనంతరం ఓబి కాంట్రాక్ట్ కంపెనీ క్యాంపు కార్యాలయాన్ని సందర్శించారు. ఓసీపీలో ఓబీ పనులు నిర్వహిస్తున్న సీఆర్‌ఆర్, డీసీసీ, జీవీఆర్ కంపెనీలు రోజువారిగా నిర్దేశిత లక్ష్యాన్ని సాధించాలన్నారు. ఇందుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఓసీపీ అధికారి పురుషోత్తంరెడ్డి, గని మేనేజర్ సుధీర్, సర్వే అధికారి సంపత్, తదితరులు పాల్గొన్నారు.

బీపీఏలో పర్యటించిన డైరెక్టర్

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలో సింగరేణి డైరెక్టర్ (ప్రాజెక్టు అండ్ ప్లానింగ్) జీ.వెంకటేశ్వరరెడ్డి పర్యటించారు. జీఎం రవిప్రసాద్‌తో కలిసి కైరిగూడ ఓసీపీని సందర్శించారు. కైరిగూడ వ్యూపాయింట్ నుంచి క్వారీలో చేపడుతున్న ఉత్పత్తి ప్రక్రియను పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీవో సత్యనారాయణ, ఏజీఎం తిరుమల్‌రావు, డీజీఎం సివిల్ సతీష్‌బాబు, మేనేజర్ ప్రవీణ్ ఫాటింగ్, సేఫ్టీ అధికారి రాజేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతోనే ప్రమాదాల నివారణ



రక్షణ ప్రతిజ్ఞ చేయిస్తున్న సేఫ్టీ జీఎం గుప్తా

శ్రీరాంపూర్: జాగ్రత్తలతోనే ప్రమాదాలను నివారించవచ్చని బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం కేహెచ్‌ఎన్ గుప్తా అన్నారు. సోమవారం ఎస్సార్పీ 3, 3ఏ గనిపై రక్షణ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రక్షణతో కూడిన ఉత్పత్తి ఉత్పాదకత మాత్రమే కంపెనీకి శ్రేయస్కరమన్నారు. కార్యక్రమంలో ఏరియా సేఫ్టీ అధికారి శ్రీధర్, సిమ్టార్స్ మేనేజర్ విజయకుమార్, ఏజెంట్ గోపాల్ సింగ్, మేనేజర్ సంతోష్ కుమార్, రక్షణాధికారి శ్రీధర్, అధికారులు చంద్రముర్కు, మహేందర్, ప్రేమ్‌కుమార్, అరుణ్ కుమార్, మధుసూదన్‌రావు, పిట్ సెక్రెటరీలు గోపాల్‌రెడ్డి, మురళిచౌదరి, మనోజ్ కుమార్, రమేశ్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

‘గల్ఫ్ కార్మికులను విస్మరిస్తే బుద్ధి చెబుతాం’



అభివాదం చేస్తున్న నాయకులు

జన్నారం: గల్ఫ్ కార్మికుల సంక్షేమాన్ని విస్మరిస్తే రానున్న ఎన్నికల్లో అధికార పార్టీకి తగిన బుద్ధి చెబుతామని గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు కల్లెడ భూమయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నాయకులు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి వేటలో అసువులు బాసిన వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. ఇంటింటికీ వెళ్లి గల్ఫ్ కార్మికులకు జరుగుతున్న అన్యాయన్ని వివరిస్తామన్నారు. సమావేశంలో గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు సేపూరి గోపాల్, వర్కింగ్ ప్రెసిడెంట్ అమరగొండ తిరుపతి, ప్రధాన కార్యదర్శి పెరుగు మల్లికార్జున్, ప్రచార కార్యదర్శి హసెన్, నాయకులు మహేశ్, అంజి, ఖాదర్, రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం



పోటీలు ప్రారంభిస్తున్న సంజీవరావు

బెల్లంపల్లి: పట్టణంలోని ఏఎంసీ క్రీడామైదానంలో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలను సోమవారం చెన్నూర్, ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యేలు ఎస్.సంజీవరావు, అమురాజుల శ్రీదేవి ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు పైడిమల్ల నర్సింగ్, జిల్లా కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ మాజీ చైర్మన్ అమురాజుల రాజేశ్వర్, మాజీ కౌన్సిలర్ రాజులాల్, తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన



నిరసన తెలుపుతున్న సెక్యూరిటీ గార్డులు

శ్రీరాంపూర్: ఆర్జీ–3 ఏరియాలో ఈ నెల 7న సెక్యూరిటీ గార్డు నాగన్నపై జరిగిన దాడిపై సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సింగరేణి ఎస్‌అండ్‌పీసీ సెక్యూరిటీ గార్డులు డిపార్టుమెంటు కార్యాలయం వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్న సెక్యూరిటీ గార్డుపై కొందరు భూ నిర్వాసితులు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సురేందర్, అశోక్, సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

‘సెక్యూరిటీ గార్డుల నియామకాలు చేపట్టాలి’



మాట్లాడుతున్న వెంకటస్వామి

మందమర్రిరూరల్(చెన్నూర్): సింగరేణిలో సెక్యూరిటీ గార్డుల నియామకాలు చేపట్టాలని సీఐటీయూ మందమర్రి బ్రాంచ్ అధ్యక్షుడు వెంకటస్వామి డిమాండ్ చేశారు. సోమవారం ఏరియాలోని ఎస్‌అండ్ పీసీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి ఆస్తులను పరిరక్షించే సెక్యూరిటీ సిబ్బందికి రక్షణ లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకులు రాజేందర్ పాల్గొన్నారు.

పట్టభద్రుడు..డ్రాగన్ ధీరుడు

- డ్రాగన్ ఫ్రూట్ సాగు చేస్తున్న యువ రైతు
- పలువురికి ఆదర్శంగా నిలుస్తున్న సత్యనారాయణ



డ్రాగన్ ఫ్రూట్ చూపిస్తున్న సత్యనారాయణ

దండేపల్లి(మంచిర్యాల): మండలంలోని కొండాపూర్‌కు చెందిన ఇప్ప సత్యనారాయణ డిగ్రీ వరకు చదివాడు. చిన్నతనం నుంచి వ్యవసాయంపై ఉన్న మక్కువతో చదువు పూర్తికాగానే తమకున్న నాలుగెకరాల్లో వరి, పత్తి పంటలు సాగు చేస్తున్నాడు. ఏదైనా కొత్తరకం పంటలు వేయాలనుకుని ఉద్యానవన పంటల వైపు దృష్టి సారించాడు.

రూ.4 లక్షల పెట్టుబడితో డ్రాగన్ సాగు

గతేడాది జనవరిలో సత్యనారాయణ అరెకరం భూమిలో రూ.4లక్షల పెట్టుబడితో డ్రాగన్ ఫ్రూట్ సాగుకు శ్రీకారం చుట్టాడు. అందులో 225 సిమెంటు స్తంభాలు వేశాడు. అనంతపూర్ నుంచి రూ.70 ఒక మొక్క చొప్పున వెయ్యి మొక్కలు తెప్పించి ఒక్కో స్తంభానికి నాలుగు మొక్కల చొప్పున నాటాడు. డ్రిప్ సిస్టంలో నీటిని అందిస్తున్నాడు. ఎలాంటి రసాయన ఎరువులు వాడకుండా డ్రిప్ సిస్టం ద్వారా సేంద్రియ ఎరువులు అందిస్తున్నాడు. అంతరపంటగా వాటర్‌మిలన్, మునగ పంటలు సాగు చేస్తున్నాడు.

18 నెలల్లో పంట..

మొక్కలు నాటిన 18 నెలల్లోనే కాయలు కాయడంతో గత నెలలో కోత ప్రారంభించాడు. మొదటి సారిగా క్వింటా దిగుబడి రావడంతో కిలోకు రూ.150 చొప్పున స్థానికంగా విక్రయిస్తున్నాడు. ఒక్కసారి మొక్క నాటితే ఏటా దిగుబడులే వస్తాయి. ఏడాదిలో ఆరునెలల పాటు కాయలు కాస్తాయని, ఐదు నెలల్లో నాలుగు సార్లు కోతకు వస్తుందని చెపుతున్నాడు. ఏటా దిగుబడి పెరుగుతుందని, ఐదేళ్లకు ఎకరాకు 5 టన్నుల దిగుబడి వస్తుందని యువరైతు సత్యనారాయణ చెప్తున్నాడు.

వింతగా చూశారు..

ఈ ప్రాంతంలో డ్రాగన్ సాగు చేయడం కొత్త కావడంతో అందరూ వింతగా చూశారు. ఎవరేం అనుకున్నా పంట సాగు చేయాలనుకున్నా. మొదటి క్రాపును చూశాక నా కల నిజమైంది. ఇంకా ఎవరైనా సాగు చేసేందుకు ముందుకు వస్తే సలహాలు, సూచనలు ఇస్తా. అవసరమున్న వారికి మొక్కలు కూడా అందిస్తా.

– సత్యనారాయణ, యువ రైతు, కొండాపూర్

‘కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలి’



మాట్లాడుతున్న బీఎంఎస్ నాయకులు

జైపూర్(చెన్నూర్): ఎస్టీపీపీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అందుగుల శ్రీనివాస్, ఎస్టీపీపీ బీఎంఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పేరం రమేశ్ డిమాండ్ చేశారు. ఎస్టీపీపీ కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారం, భూనిర్వాసితులకు శాశ్వత ఉద్యోగాలు ఇవ్వాలని కోరుతూ సోమవారం బీఎంఎస్ ఆధ్వర్యంలో ఒక్కరోజు నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్టీపీసీలో కార్మికులకు చెల్లిస్తున్న మాదిరిగా వేతనాలు, అలవెన్సులు, ఇన్‌సెంటీవ్స్ చెల్లించాలన్నారు. విలువైన భూములు కోల్పోయి రైతులు, నిరుద్యోగులు కూలీలుగా మారారన్నారు. కనీసం వారికి ఉపాధి కూడా కల్పించకుండా సింగరేణి యాజమాన్యం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. బీజేపీ మేనిఫెస్టోలో కాంట్రాక్టు వ్యవస్థ రద్దు చేసి పర్మినెంట్ ఉద్యోగాలు కల్పించేలా ప్రతిపాదిస్తామన్నారు. కార్యక్రమంలో చినూరి రాజేందర్, దుస్స భాస్కర్, చిలకాని వెంకటేశ్, కాశెట్టి నాగేశ్వర్‌రావు, రాజుయాదవ్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

సద్దుల బతుకమ్మ ఘనంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న జీఎం మనోహర్

మందమర్రిరూరల్(చెన్నూర్): మందమర్రి ఏరియాలో సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా జరుపుకోవాలని ఏరియా జీఎం మనోహర్ అన్నారు. బతుకమ్మ ఏర్పాట్లపై సోమవారం అధికారులతో సమావేశమై తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో భాగంగా ఈ నెల 18న ఇల్లందు క్లబ్ ఆవరణలో ఫ్యామిలీ డే వేడుక ఉంటుందన్నారు. 22న మందమర్రిలోని సింగరేణి హైస్కూల్ గ్రౌండ్, రామకృష్ణాపూర్‌లోని ఠాగూర్ స్టేడియం, సోమగూడెంలోని భరత్ కాలనీ గ్రౌండ్, బెల్లంపల్లిలోని ఏఎంసీ గ్రౌండ్స్‌లో సద్దుల బతుకమ్మ వేడుక నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. సింగరేణి కార్మిక కుటుంబాలతో పాటు పరిసర ప్రాంత మహిళలు ఉత్సాహంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏరియా ఎస్వోటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి, పీఎం శ్యాంసుందర్, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి చర్యలు



అర్జీలు స్వీకరిస్తున్న డీడీ దిలీప్‌కుమార్

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని డీడీ దిలీప్‌కుమార్ అన్నారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనుల తమ సమస్యలను పరిష్కరించాలంటూ అర్జీలు అందజేశారు. బెజ్జూర్ మండలం కూడా గ్రామానికి చెందిన కె.భారతి తనకు కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇప్పించాలని కోరింది. తలమడుగు మండలం పల్సి గ్రామానికి చెందిన మడావి అశ్విని బీఈడీ కళాశాలలో ప్రవేశం కల్పించాలని, పెంబి మండలం కొలాంగూడ గ్రామానికి చెందిన ఆత్రం మాణిక్‌రావు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని అవ్వల్ అంబుస్స్‌కు డ్రైవర్‌గా ఉద్యోగం కల్పించాలని అర్జీ సమర్పించాడు. పింఛన్, రెండు పడకల గదుల ఇండ్లు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలంటూ ప్రజలు దరఖాస్తులు అందజేశారు. ప్రజావాణిలో ఏపీవో కనక భీంరావు, ఏడీఎం హెచ్‌వో బాలు, ఏవో రాంబాబు, ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్, పీహెచ్‌వో సందీప్, జేడీఎం నాగభూషణం, ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, డీపీవో ప్రవీణ్ పాల్గొన్నారు.